క్లుప్తంగా

నేడు సింహగిరిపై కృష్ణాష్టమి

• సాయంత్రం 6 వరకే దర్శనాలు

సింహాచలం: సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో మంగళవారం శ్రీకృష్ణాష్టమిని వైభవంగా నిర్వహించనున్నట్లు సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. రాత్రి శ్రీకృష్ణ జననోద్ధారణ పూజలు, బాలకృష్ణుడికి బేడా తిరువీధి నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా సాయంత్రం 6 గంటల వరకే స్వామివారి దర్శనాలు భక్తులకు లభిస్తాయని పేర్కొన్నారు. ఆరాధన టిక్కెట్లు రద్దు చేసినట్లు వెల్లడించారు. నిత్యం ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు ఉండే రాజభోగం బ్రేక్ మంగళవారం ఉండదని, ఆ సమయంలో కూడా భక్తులు స్వామివారిని దర్శించుకోవచ్చన్నారు. 28న సాయంత్రం 4 గంటలకు సింహగిరిపై ఉట్ల సంబరం ఉంటుందన్నారు.

19న నేస్తాలమ్మ పండగ



పరవాడ: వాడచీపురుపల్లి, నాయుడుపాలెం గ్రామ పంచాయతీల ప్రజల ఆరాధ్య దైవం నేస్తాలమ్మ అమ్మవారి పండగను సెప్టెంబరు 19న ఘనంగా నిర్వహించాలని ఇరు గ్రామాల పెద్దలు సోమవారం నిర్ణయించారు. సెప్టెంబరు 7న అమ్మవారి పండగ చాటింపు, 11న అమ్మవారి ఘటాలకు పూజలు జరుపుతారు. 12 నుంచి 18 వరకు వారం రోజుల పాటు గ్రామ పురవీధుల్లో అమ్మవారి ఊరేగింపు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తారు. 19న గురువారం అమ్మవారి అనుపు మహోత్సవాలను అత్యంత వైభవంగా జరపనున్నట్లు పూజారి అప్పలనాయుడు తెలిపారు.

రాజుకు అంబేడ్కర్ జాతీయ సేవా అవార్డు



అవార్డు అందుకుంటున్న రాజు

పరవాడ: పలు సాంస్కృతిక, సేవా కార్యక్రమాలు నిర్వహించిన పరవాడ మండలం ఈబోనంగి గ్రామానికి చెందిన ఎం.డి.రాజుకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జాతీయ సేవా అవార్డు దక్కింది. మదర్ సర్వీస్ సొసైటీ రెండవ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడలో సోమవారం జరిగిన ఓ కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధులు ఈ అవార్డును రాజుకు అందించారు. తనకు అవార్డు అందించిన సొసైటీ ప్రతినిధులకు రాజు కృతజ్ఞతలు తెలిపారు.

బంగారుతల్లి సేవా సమితికి పురస్కారం



అవార్డు అందుకుంటున్న వెంకటరావు

సబ్బవరం: స్థానిక జోడుగుళ్ల ప్రాంతానికి చెందిన శ్రీబంగారుతల్లి సేవా సమితి చేస్తున్న సేవలకుగాను సమితి అధ్యక్షుడు సింగంపల్లి వెంకటరావుకు డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం అవార్డు వరించింది. మదర్ థెరీసా జన్మదినాన్ని పురస్కరించుకుని విజయవాడలోని డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు కళావేదికలో మదర్ సర్వీసెస్ సొసైటీ అధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని సోమవారం అందించారు. కార్యక్రమంలో సింగంపల్లి వెంకటరావుతో పాటు బంగారు తల్లి సేవా సమితి సభ్యులు గొంప ప్రసాద్, కోన నూకరాజు, గెద్దం సూరిబాబు, సూరెడ్డి నాగరాజు, జెట్టి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ దుర్మరణం

పెందుర్తి: విశాఖ–అరకు రోడ్డులోని పెందుర్తి నూకాలమ్మ ఆలయం సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ లారీ డ్రైవర్ దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాలు. విజయనగరం జిల్లా వేపాడ మండలం జాకేరుకు చెందిన వి.హరికృష్ణ బతుకు తెరువు కోసం పెందుర్తి వచ్చాడు. లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. సోమవారం ఉదయం బైక్‌పై పనిమీద బయటకు వెళ్లిన హరికృష్ణ తిరిగి వస్తున్న క్రమంలో టాటా ఏస్ వాహనం ఢీకొట్టింది. దీంతో రోడ్డుపై పడి, తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పెందుర్తి పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. సీఐ రామకృష్ణ ఆధ్వర్యంలో కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నారు.

రక్షణ బాధ్యత ప్రభుత్వాలదే..



రేయింబవళ్లు రోగులకు వైద్య సేవలు అందించే వైద్యులకే రక్షణ కరవైతే.. అంతకంటే దారుణం మరొకటి ఉండదు. వైద్యులతో పాటు ఇతర శాఖల్లో పనిచేసే మహిళా ఉద్యోగులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపైనే ఉంది. కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచారానికి పాల్పడిన మృగాలను కఠినంగా శిక్షించాలి. ఇకమీదట ఇలాంటి ఆలోచన చేసేందుకూ్కడా భయపడేలా శిక్ష ఉండాలి. ఆస్పత్రులు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద మహిళాసిబ్బందికి భద్రత మరింతగా పెంచాలి.

– డాక్టర్ హారిక, ప్రభుత్వ వైద్యాధికారి, పరవాడ

సెక్యూరిటీ కట్టుదిట్టంగా ఉండాలి



ఆస్పత్రిలో విధులు నిర్వర్తించే వైద్యుల రక్షణకు పటిష్ట సెక్యూరిటీని ఏర్పాటు చేయాలి. వైద్యులకు ఏమైనా జరిగితే తనకు పనిష్మెంట్ ఉంటుందన్న భయం ఆ సిబ్బందిలో ఉండాలి. ముఖ్యంగా రాత్రి వేళల్లో మహిళా వైద్యులు సేవలందించేటప్పుడు ఆస్పత్రికి ఎవరొస్తున్నారో, ఎవరు బయటకు వెళ్తున్నారో పకడ్బందీగా నిఘా పెట్టాలి. సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి. వైద్యులు ఫిర్యాదు చేస్తే పోలీసులు వెంటనే రెస్పాండ్ కావాలి.

– డాక్టర్ పార్వతి, పిల్లల వైద్యురాలు, ఆరోగ్య కేంద్రం, అడవివరం

సింహాచలేశా.. నీ మహిమ చాటేదెలా?

- పూర్తిగా మూలకు చేరిన సింహాచల క్షేత్రదర్శిని
- పదేళ్ల క్రితం క్షేత్ర వైభవాన్ని తెలిపేలా లఘు చిత్ర ప్రదర్శనశాల ఏర్పాటు
- దేవస్థానం అధికారుల నిర్లిప్తతతో అనతి కాలంలోనే మూలనపడ్డ వైనం
- క్షేత్ర దర్శినిని పునరుద్ధరించాలంటున్న భక్తులు

ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం సింహాచలేశుడు. మనసారా కొలిచిన వారి కష్టాలను కడతేర్చుతాడని భక్తుల నమ్మకం. ఆ నమ్మకానికి నిదర్శనాలుగా నిలిచే సంఘటనల సమాహారం, సింహాద్రిపై లక్ష్మీనృసింహస్వామి కొలువైన తీరు తదితర అంశాలతో డాక్యుమెంటరీలను రూపొందించి, గతంలో భక్తులకు క్షేత్రదర్శినిలో ప్రదర్శించేవారు. ప్రస్తుతం క్షేత్రదర్శిని మూలకు చేరింది. దీన్ని పట్టించుకోవాల్సిన అధికార యంత్రాంగం.. దాన్ని శాశ్వతంగా పక్కన పెట్టేసింది. గతంలో అక్కడ ప్రదర్శన తిలకించిన భక్తులు.. మళ్లీ ఎప్పుడు తెరుస్తారంటూ ఆలయ అధికారుల్ని ఆరా తీస్తున్నారు.



అప్పుడు సింహగిరిపై క్షేత్రదర్శినిగా ఉన్న భవనం



ఇప్పుడు సీసీ కెమెరాల కంట్రోల్ రూమ్‌గా మారిన భవనం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకునేందుకు సింహగిరికి వచ్చే భక్తులకు క్షేత్ర విశిష్టతను డాక్యుమెంటరీ రూపంలో తెలిపేందుకు ఏర్పాటు చేసిన క్షేత్రదర్శిని(లఘుచిత్ర ప్రదర్శనశాల) మూలకు చేరింది. పదేళ్ల క్రితం క్షేత్రదర్శిని ప్రారంభోత్సవాన్ని ఆర్భాటంగా చేసిన దేవస్థానం అధికారులు, ఆ తర్వాత దాన్ని పట్టించుకోవడం మానేశారు. ఇప్పుడు ఏకంగా క్షేత్రదర్శినిని కనుమరుగు చేశారు. సీసీ కెమెరాల కంట్రోల్ రూమ్‌గా మార్చేశారు.

పర్యాటక శాఖ సహకారంతో..

సింహగిరిపై అన్నప్రసాద భవనానికి వెళ్లే దారిలో ఆంధ్రప్రదేశ్ పర్యాటకాభివృద్ధి శాఖ సమాచార కేంద్రం పేరిట ఓ భవనాన్ని నిర్మించేందుకు పదేళ్ల కిందట సంకల్పించింది. దీనికి దేవస్థానం సుమారు 150 చదరపు గజాల స్థలాన్ని కేటాయించింది. ఆ స్థలంలో రూ.15 లక్షలతో టూరిజం శాఖ భవనాన్ని నిర్మించి, దేవస్థానానికి అప్పగించింది. ఆ భవనంలో దేవస్థానం విచారణ కార్యాలయం, టూరిజంశాఖకి సంబంధించిన సమాచార కేంద్రాన్ని ఏర్పాటు చేయాలనుకున్నారు. ఆ సమయంలో ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో ఆయా క్షేత్రాల విశిష్టతను తెలిపేలా లఘు చిత్ర ప్రదర్శనశాలల ఏర్పాటుకు రాష్ట్ర దేవదాయశాఖ నిర్ణయించింది. దీంతో సింహాచలంలో మరెక్కడా స్థలమే లేనట్లు, సమాచార కేంద్ర భవనాన్నే లఘు చిత్ర ప్రదర్శనశాలగా మార్చారు. రూ.5 లక్షలు వెచ్చించి స్క్రీన్, ప్రొజెక్టర్, కుర్చీలు, ఏసీలు ఏర్పాటు చేశారు. సింహాచల క్షేత్ర విశేషాలతో అరగంట నిడివి గల సీడీలను రూపొందించి, ఇక్కడ ప్రదర్శించేవారు.

ఆరంభ శూరత్వమే

ఆరంభంలో ఒక్కో భక్తుడి నుంచి రూ.10 టికెట్ ధరగా వసూలు చేసి, ఈ వీడియోల ద్వారా క్షేత్ర మహత్యాన్ని ప్రదర్శించేవారు. అది కూడా ఒకటి రెండేళ్లే. ఆ తర్వాత క్షేత్ర దర్శిని నిర్వహణపై అధికారులు దృష్టి సారించనేలేదు. భక్తుల నుంచి స్పందన లేదంటూ దాన్ని మూసేశారు. ఆ తర్వాత కొన్నాళ్లు దేవస్థానంలో జరిగే ప్రధాన ఉత్సవాల సందర్భంగా నిర్వహించే సమావేశాలకు తెరిచేవారు. ఇప్పుడు ఏకంగా క్షేత్రదర్శినిని సీసీ కెమెరాల కంట్రోల్ రూమ్‌గా మార్చేశారు. భక్తులకు క్షేత్రదర్శిని ఉందని ప్రచారం చేయకపోవడం, అధికారుల అలసత్వం వల్లే ఈ పరిస్థితి నెలకొందని పలువురు విమర్శిస్తున్నారు. ప్రస్తుతం భక్తుల తాకిడి పెరిగింది. పైగా అన్నప్రసాద విభాగానికి వెళ్లే దారిలోనే ఇది ఉంది. అన్నప్రసాదం కోసం నిరీక్షించే సమయంలో దీన్ని తిలకించే అవకాశాన్ని కల్పిస్తే బాగుంటుందని భక్తులు కోరుతున్నారు.

క్షేత్ర విశిష్టత అందరికీ తెలియాలి



క్షేత్ర దర్శినిని అందుబాటులోకి తెస్తే సింహాచల క్షేత్ర విశిష్టత భక్తులకు తెలుస్తుంది. సింహగిరికి వచ్చే భక్తులకు స్వామివారి మహిమ, విశిష్టత, క్షేత్రమహత్యాన్ని తెలిపిన వాళ్లమవుతాం. ఈ తరం పిల్లలకు మాటలతో చెప్పేదానికంటే, వీడియో రూపంలో క్షేత్ర విశిష్టతను తెలిపే ఏర్పాట్లు చేయడం చాలా మంచిది. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– లక్ష్మీనారాయణ, నాతయ్యపాలెం, విశాఖపట్నం

అందుబాటులోకి తేవాలి



సింహాచల వైభం తెలిపేలా క్షేత్రదర్శిని అనేది ఒకటుందన్న విషయం చాలా మంది భక్తులకు తెలియదు. దాన్ని పునః ప్రారంభిస్తే, స్వామివారి చరిత్ర, మహత్తును దృశ్య రూపంలో తిలకించి, పునీతులమవుతాం. క్షేత్రదర్శిని గురించి సింహగిరిపై మైకుల్లో రోజూ విస్తృతంగా ప్రచారం చేయాలి. కరపత్రాల రూపంలో కూడా క్షేత్రదర్శినిలో ప్రదర్శించే లఘు చిత్రాల విశేషాలను తెలియపర్చాలి.

– గణేష్, భక్తుడు, శ్రీకాకుళం

చర్చించి, నిర్ణయం తీసుకుంటాం



క్షేత్రదర్శిని పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటాం. దేవస్థానం ఇంజినీరింగ్, ఆలయ అధికారులతో సమావేశమై, నిర్ణయం తీసుకుంటాం. ప్రస్తుతం సీసీ కెమెరాల మోనటరింగ్ వ్యవస్థ క్షేత్రదర్శిని భవనంలోనే ఉంది. దాన్ని మార్చాలా? లేకుంటే క్షేత్రదర్శినిని వేరే చోట ఏర్పాటు చేయాలా? అన్న అంశాన్ని పరిశీలిస్తాం. క్షేత్ర వైభవంపై ఇటీవల మరికొన్ని వీడియోలు చేయించాం. ప్రసాద్ స్కీమ్‌లో డిజిటల్ థియేటర్ నిర్మాణం కూడా ఉంది.

– ఎస్.శ్రీనివాసమూర్తి, సింహాచలం ఈవో

ప్రమాదవశాత్తూ జారిపడి మహిళా కూలి మృతి

న్యాయం చేయాలని బంధువుల ఆరోపణ



యర్రయ్యమ్మ(ఫైల్)

పెందుర్తి: నిర్మాణంలో ఉన్న బహుళ అంతస్తుల భవనానికి వాటరింగ్ చేస్తున్న మహిళ ప్రమాదవశాత్తూ జారిపడి మృతి చెందిన ఘటనపై వివాదం చెలరేగింది. పెందుర్తి అన్నపూర్ణ లే అవుట్‌లో ఆదివారం జరిగిన ఈ ఘటన వివరాలు. జీవీఎంసీ 96వ వార్డు అన్నపూర్ణ లేఅవుట్ బృందావన్ కాలనీ సమీపంలో పూర్వి కన్‌స్ట్రక్షన్స్ పేరిట ఓ బిల్డర్ అపార్ట్‌మెంట్ నిర్మిస్తున్నాడు. ఇందులో వాచ్‌మన్‌గా విజయనగరం జిల్లా జామి గ్రామానికి చెందిన రమణ, యర్రయ్యమ్మలు చేరారు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం భవనానికి వాటరింగ్ చేస్తూ యర్రయ్యమ్మ భవనం మీది నుంచి జారి కిందికి పడింది. తోటి కార్మికులు స్పందించి, తీవ్ర గాయాలతో ఉన్న ఆమెను ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందింది. ప్రమాద సమయంలో అక్కడే ఉన్న బిల్డర్, సూపర్‌వైజర్ నిర్లక్ష్యం కారణంగా, సకాలంలో చికిత్స అందక యర్రయ్యమ్మ మృతి చెందినట్లు మృతురాలి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. తగిన న్యాయం చేయాలని కోరుతున్నారు.

ఏయూ హాస్టళ్లు, మెస్‌ల తనిఖీ

విశాఖ సిటీ: ఆంధ్ర విశ్వవిద్యాలయం హాస్టళ్లు, మెస్‌లను సోమవారం ఏయూ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. రెక్టార్ ఆచార్య ఎస్.కిషోర్‌బాబు, ప్రిన్సిపాల్స్ ఆచార్య ఎ.నరసింహారావు, ఎం.వి.ఆర్.రాజు, చీఫ్ వార్డెన్‌లు ఆచార్య ఎస్.హరనాథ్, ఆచార్య కె.రమేష్‌బాబు ముందుగా మెస్‌లలో భోజన నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు అందించే టిఫిన్‌ను స్వయంగా రుచిచూశారు. విద్యార్థులకు రుచికరమైన ఆహారాన్ని అందించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం విద్యార్థుల హాస్టళ్లు తనిఖీ చేశారు. వారికి వసతి కల్పిస్తున్న విధానాన్ని ప్రత్యక్షంగా గమనించారు.

కృష్ణం విశ్వమోహన బాలకృష్ణం

శ్రీకృష్ణ జన్మాష్టమి.. కులమత భేదం లేకుండా ప్రతి తల్లీ తన బిడ్డను గోపిక, బాలకృష్ణుల రూపంలో చూసుకుని మురిసిపోయే రోజు. ఆడపిల్లల్ని కూడా చిన్ని కృష్ణుడిగా అలంకరించి, ఫొటోలు తీయించి, దాచుకునే సమయం. వెన్నమీగడల ప్రసాదాలు, ఉట్టి సంబరాలతో నియోజకవర్గంలోని ఊరూవాడా ఉత్సాహం ఉరకలెత్తింది. శ్రీకృష్ణ మందిరాలు, వైష్ణవాలయాలు ఉదయం నుంచీ దేవకీ సుతుని నామ సంకీర్తనలతో మారుమోగాయి. ప్రతి వీధిలో ఉట్టి సంబరంలో యువత ఉత్సాహంగా పాల్గొన్నారు.





కృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు



కృష్ణుడి వేషధారణలో చిన్నారి



కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న చిన్నారులతో పాఠశాల ఉపాధ్యాయ బృందం



దేవీపురంలో కృష్ణాష్టమి వేడుకల్లో చిన్నారులు



పురుషోత్తపురంలో కృష్ణుని సన్నిధిలో మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్, నాయకులు

- ఊరూవాడా ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు
- చిన్ని కృష్ణుల చిందులతో ఝల్లుమన్న గుండెలు
- శ్రీకృష్ణుడి నామ సంకీర్తనలతో మార్మోగిన ఆలయాలు

పెందుర్తి: నియోజకవర్గంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. చిన ముషిడివాడలోని శారదాపీఠంలో కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా శ్రీకృష్ణుడికి అభిషేకాలు, పూజలు జరిపారు. పీఠంలోని గోశాలలో గోవులకు గోపూజలు చేశారు. సాయంత్రం కోలాటాలు ఉత్సాహభరితంగా సాగాయి. అనంతరం ఉట్టి సంబరం అంబరాన్నంటింది. కృష్ణుడు, గోపికల వేషధారణలతో చిన్నారులు సందడి చేశారు.

• సుజాతనగర్‌లోని శ్రేయ ఫౌండేషన్‌లో జన్మాష్టమి వేడుకలు నిర్వహించారు. ప్రత్యేకావసరాల పిల్లలు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో ఆకట్టుకున్నారు. సంస్థ ప్రతినిధులు ఎం.భాగ్యలక్ష్మి, కె.సంతోషి, కె.కుమారి, కె.సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

• పురుషోత్తపురంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో ఉదయం నుంచి అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిపారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధనలో దాదాపు 5 వేల మంది భక్తులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, కార్పొరేటర్లు ముమ్మన దేముడు, బల్ల శ్రీనివాసరావు, రాపర్తి కన్నా, వైఎస్సార్‌సీపీ, టీడీపీ, జనసేన నాయకులు, ఆలయ కమిటీ ప్రతినిధులు పూజల్లో పాల్గొన్నారు.

• పెందుర్తిలోని బాలాజీ విద్యాసంస్థల్లో జన్మాష్టమి వేడుకలు ఘనంగా జరిపారు. చైర్మన్ కోట నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ పి.గాయత్రీదేవి, కె.గంగునాయుడు పాల్గొన్నారు.

• సుజాతనగర్‌లోని ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో జన్మాష్టమి వేడుకల్లో భాగంగా విద్యార్థులు శ్రీకృష్ణుడు గోపికల వేషధారణలతో ఆకట్టుకున్నారు. ప్రిన్సిపాల్ వాకా చంద్రశేఖర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

• ప్రశాంతినగర్ బృందావన విహార్ కాలనీలో కొలువుదీరిన వేణుగోపాలస్వామి ఆలయంలో శ్రీకృష్ణుడికి అభిషేకాలు జరిపారు. మధ్యాహ్నం అన్నసమారాధన చేశారు. ఆలయ ప్రతినిధులు మోరి సింహాచలం, శర్మ, ఆదినారాయణ, చిన్న శంకర్రావు, నాయుడు, కామేశ్వరరావు, జగన్, తులసి, శోభారాణి, ఝాన్సీ, అమ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

• శ్రీరాంపురంలోని కృష్ణ మందిరంలో ఆలయ ప్రధానార్చకులు శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచి స్వామికి తులసి, పాలు, వెన్న, నెయ్యితో అభిషేకం జరిపారు. మధ్యాహ్నం 3 వేల మందికి అన్నసమారాధన చేశారు. సాయంత్రం ఉట్టి సంబరం వైభవంగా నిర్వహించారు.

పరవాడ: మండలంలోని రావాడ, నాయుడుపాలెం శివారు గొల్లపేట గ్రామాల్లో కృష్ణాష్టమి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా స్థానిక శ్రీకృష్ణుడి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు ఆలయంలో స్వామివారిని దర్శించుకుని, పూజలు జరిపారు. మధ్యాహ్నం ఆలయాల వద్ద అన్నసమారాధన ఏర్పాటు చేశారు. రావాడలో శ్రీకృష్ణుడిని వైఎస్సార్‌సీపీ నాయకులు పల్లా గోవిందు, యూత్ సభ్యులు సిరా రాజేష్, నాగేష్, అనిల్, వి.కల్యాణ్, కరక సాయి, జి.సన్యాసినారాయణ, మహిళలు దర్శించుకుని, పూజలు చేశారు. మండలంలోని పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా పాఠశాల విద్యార్థులు రాధాకృష్ణులు, గోపికల వేషధారణలతో ఆకట్టుకున్నారు. వేడుకల్లో పాల్గొన్న పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్.సీతాలక్ష్మి మాట్లాడుతూ కృష్ణాష్టమి ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమాన్ని చక్కగా నిర్వహించిన ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు. వేడుకల్లో సీఈవో కె.నిశాంత్, కోఆర్డినేటర్ రామలక్ష్మి, టీచర్లు పాల్గొన్నారు.

సింహాచలం: అడవివరంలోని మధ్యవీధిలో లొడగల బ్రదర్స్ ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు వైభవంగా జరిగాయి. శ్రీకృష్ణుడి విగ్రహాన్ని ఏర్పాటు చేసి, పూజలు జరిపారు. సాయంత్రం ఉట్ల సంబరాన్ని ఘనంగా నిర్వహించారు. మ్యూజికల్ చైర్ పోటీల్లో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

• అడవివరంలోని గాంధీనగర్ వద్ద శ్రీ మురళీకృష్ణ సేవా సంఘం ఆధ్వర్యంలో జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కృష్ణుడి విగ్రహానికి యాదవులు విశేష పూజలు జరిపారు. సాయంత్రం ఉట్టి సంబరాన్ని నిర్వహించారు. మహిళల కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. స్వామిని 98వ వార్డు కార్పొరేటర్ పి.వి.నరసింహం దర్శించుకుని పూజలు చేశారు. పంచదార్ల శ్రీను, శీర కృష్ణ పాల్గొన్నారు.

98వ వార్డు పరిధి లక్ష్మీనరసింహనగర్‌లో ఉన్న గోపీజనవల్లభస్వామి ఆలయంలో సోమవారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం 6 నుంచి స్వామికి గోక్షీరాభిషేకం, 8 గంటలకు సహస్రనామార్చన, విష్ణుసహస్రనామ పారాయణం నిర్వహించారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన జరిపారు. సాయంత్రం స్వామికి 108 రకాల ప్రసాద నివేదన చేశారు. ఒక్కో ఇంటి నుంచి ఒక్కో రకం ప్రసాదాన్ని స్థానికులు తెచ్చి, స్వామికి ఆరగింపు చేశారు. అనంతరం స్వామివారి ఉత్సమూర్తులను ఉయ్యాలలో ఉంచి ఊంజల్ సేవ నిర్వహించారు. చిన్నారులకు బాలకృష్ణ వేషధారణ పోటీలు జరిపారు. స్వామివారిని నగర మేయర్ హరివెంకట కుమారి, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, కార్పొరేటర్లు ముమ్మన దేముడు, రాపర్తి కన్నా, బల్ల శ్రీను తదితరులు దర్శించుకున్నారు.

సబ్బవరం: స్థానిక గోపాల్‌నగర్ శ్రీకృష్ణమందిరంలో వేకువజాము నుంచే భక్తులు పూజలు చేశారు.

• సబ్బవరంలో స్వామివారిని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు, మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గండి రవికుమార్ తదితరులు దర్శించుకుని, ప్రత్యేక పూజలు జరిపారు.

• రాయపుర అగ్రహారంలో కృష్ణాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన జరిపారు.

• దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి ఆరాధనా పీఠంలో కృష్ణాష్టమి సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపారు. రాధాకృష్ణులు, గోపికల వేషధారణలో చిన్నారులు ఆకట్టుకున్నారు.



అడవివరం మధ్య వీధిలో ఉట్ల సంబరం



ప్రశాంతినగర్‌లో పూజలు చేస్తున్న భక్తులు



రాంపురంలో పూజల్లో పాల్గొన్న భక్తులు



పెందుర్తిలో కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు



గాంధీనగర్‌లో శ్రీకృష్ణుడికి పూజలు చేస్తున్న కార్పొరేటర్ నరసింహం, యాదవులు



సబ్బవరంలో స్వామిని దర్శించుకుంటున్న వైఎస్సార్‌సీపీ నేత గండి రవికుమార్



కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న భక్తులు







గోపిక, బాలకృష్ణుల వేషధారణలో చిన్నారులు